ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం
# టీ-మీడియా
సామాజికం.. ప్రజల పక్షం...
సంపుటి : 35
సంచిక : 36
పేజీలు : 4
ఆదివారం, సెప్టెంబర్ 14, 2025
GSTIN:36FDKPS1308P1ZX | Digital, tmedia.net.in
ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ



## పకడ్బందీగా యూరియా పంపిణీ

**-మండల స్థాయిలో కోఆర్డినేషన్ సమావేశాలు**

**-జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్**

**టీ మీడియా, సెప్టెంబర్ 13 , మహబూబాబాద్:**

మహబూబాబాద్ కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె.అనిల్ కుమార్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారిని విజయనిర్మల, సహకార శాఖ అధికారి వెంకటేశ్వర్లు, జిల్లాలోని అన్ని మండలాల తహసీల్దారులు, ఎంపీడీవోలు,వ్యవసాయ శాఖ అధికారులతో యూరియా సరఫరా పై జిల్లా యంత్రాంగం తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్,లి సమీక్ష సమావేశం నిర్వహించారు .ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా యూరియా పంపిణీ చేయుటకు ఇప్పటికే వేసుకున్న ప్రణాళిక ప్రకారం ముందుకు సాగాలని, క్షేత్రస్థాయిలో ప్రతి ఒక్క ఉద్యోగి రైతు వేదికలు, ప్రాథమిక సహకార సొసైటీలు, తదితర కొనుగోలు కేంద్రాల వద్ద అందుబాటులో కచ్చితంగా ఉండాలని, రైతులకు వస్తున్న స్టాక్ వివరాలను తెలియపరచి వారిని మాత్రమే కొనుగోలు కేంద్రాలకు వచ్చే విధంగా ముందస్తు సమాచారం ఇవ్వాలని, ఇప్పటివరకు యూరియా అందని రైతుల వివరాలను సేకరించి వారికి యూరియాలు సరఫరా చేయాలని, కొనుగోలు కేంద్రాల వద్ద రైతుల సౌకర్యార్థం త్రాగునీరు, టెంట్స్, చైర్స్ , సదుపాయాలు కల్పించాలని, క్షేత్రస్థాయిలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, యూరియా పంపిణీ విధులలో నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.సోషల్ మీడియా,వివిధ సామాజిక మాధ్యమాలలో యూరియా రాదేమో అని, కొన్నిచోట్ల అసత్య ప్రచారాలు జరుగుతున్నాయని, అలాంటి అసత్య ప్రచారాలను మండల స్థాయి లలో ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు, ఇప్పటికే (18) మండల ప్రత్యేక అధికారులు, వ్యవసాయ, సహకార, సంఘాల ద్వారా సరఫరా చేయడం జరుగుతుందనీ, క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించాల్సిన ఉద్యోగులకు లిఖితపూర్వకంగా ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు, మండల స్థాయి యూరియా పంపిణీ కోఆర్డినేషన్ కమిటీ సమావేశాలు నిర్వహించి పక్కాగా యూరియా పంపిణీ చేయాలన్నారు .ప్రస్తుతం ఉన్న కొనుగోలు కేంద్రాలతో పాటు అదనపు కొనుగోలు కేంద్రాల నిర్వహణకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని రద్దీ ఎక్కువగా ఉన్నచోట అదనపు క్యూ లైన్ లను ఏర్పాటు చేయడం జరుగుతుందని, పోలీస్ సిబ్బంది ద్వారా రక్షణ చర్యలు చేపట్టడం జరుగుతుందనిజిల్లాకు రావాల్సిన యూరియా కోట తోపాటు అదనపు యూరియా కోసం రాష్ట్ర స్థాయి ఉన్నత అధికారుల ద్వారా సంబంధిత సిబ్బంది చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.యూరియా సరఫరా అయ్యే వాహనాల యొక్క వివరాలను పక్కాగా సమాచారం తెలుసుకొని నిత్యం గమనిస్తూ ఉండాలని అన్నారు.రెవెన్యూ డివిజనల్ అధికారులు నిత్యం కేంద్రాలను తనిఖీ చేస్తూ నివేదికలను సమర్పించాలని ఆదేశించారు, వ్యవసాయ, సహకార, అన్ని విభాగాల సిబ్బంది సమన్వయంతో కలిసి ఎలాంటి పొరపాట్లు జరగకుండా ముందస్తు ప్రణాళిక ప్రకారం యూరియా పంపిణీ విజయవంతంగా పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు,ఈ సమావేశంలో తొర్రూరు, మహబూబాబాద్ రెవెన్యూ డివిజనల్ అధికారులు, గణేష్, కృష్ణవేణి,వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్లు అజ్మీరా శ్రీనివాసరావు, విజయ్ చంద్ర, శ్రీనివాస్,తహసిల్దార్లు, ఎంపీడీవోలు, మండల వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# సింగరేణిలో సివంగులకు జాబ్ ఆఫర్

- డ్రైవింగ్ లైసెన్సు ఉన్నమహిళలలు అర్హులు
- ఆపరేటర్లుగా తొలిసారి అవకాశం

**టీమీడియా, సెప్టెంబర్ 13 , భద్రాద్రి కొత్తగూడెం :**

పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాలలో దూసుకుపోతున్నారు. విద్యా, ఉపాధి రంగాలలో పురుషులకు గట్టిపోటీ ఇస్తున్నారు. మహిళలు నేడు అన్ని రంగాలలో తమదైన ముద్ర వేసుకుంటున్నారు. అయితే ప్రభుత్వ, ప్రైవేటు రంగాలలోని వివిధ సంస్థలు స్త్రీ, పురుష అసమానతలను తొలిగించేందుకు. ఇంత వరకు పురుషులు మాత్రమే చేయగలరు అనుకునే ఉద్యోగాలకు సైతం మహిళలకు అవకాశం కల్పిస్తున్నారు. మహిళా సాధికారతలో భాగంగా సింగరేణి బొగ్గు గనుల యాజమాన్యం ఓపెన్ కాస్ట్ గనుల్లో మహిళలకు భారీ యంత్రాలపై ఆపరేటర్లుగా పనిచేసే అవకాశం ఇవ్వబోతుంది. ఈ ఉద్యోగాలకు మహిళలను ఎంపిక చేయడం సింగరేణి చరిత్రలో ఇదే తొలిసారి.సింగరేణి యాజమాన్యం ఓపెన్ కాస్ట్ గనుల్లో భారీ యంత్రాలపై ఆపరేటర్లుగా పని చేయడానికి ఎంపిక కోసం దరఖాస్తుల్ని ఆహ్వానిస్తోంది. మైనింగ్ రంగంలో మహిళల సాధికారత, సమాన అవకాశాలు, మానవ వనరుల సమర్థ వినియోగంలో భాగంగా సీఎండీ ఎన్.బలరామ్ ఆలోచనల మేరకు సంస్థ ఈ నిర్ణయం తీసుకుంది. సింగరేణి యాజమాన్యం అన్ని గనులకు, డిపార్ట్మెంట్లకు శనివారం సర్క్యులర్ విడుదల చేసింది. ఓపెన్ కాస్ట్ గనుల్లో మహిళలకు భారీ యంత్రాలపై ఆపరేటర్లుగా పనిచేసే అవకాశం ఇవ్వడం సింగరేణి చరిత్రలో ఇదే తొలిసారి కావడం విశేషం.



**వీరు మాత్రమే ఉద్యోగానికి అర్హులు**

సింగరేణి సంస్థలో ప్రస్తుతం జనరల్ అసిస్టెంట్ లేదా బదిలీ వర్కర్?గా పనిచేస్తున్న వారు దీనికి అర్హులు. 35 సంవత్సరాల లోపు వయసు ఉండి కనీసం ఏడోతరగతి పాసైన మహిళా అభ్యర్థులు ఈ ఆపరేటర్ పోస్టుకు దరఖాస్తు చేసుకోవచ్చు అని యాజమాన్యం పేర్కొంది. దరఖాస్తు చేసుకునే మహిళలు శారీరక సామర్థ్యం కలిగి ఉండాలని తెలిపింది. వారికి కనీసం ద్విచక్ర లేదా నాలుగు చక్రాల వాహన డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలని, ఆగస్టు 2024 కన్నా ముందు డ్రైవింగ్ లైసెన్స్ పొంది ఉన్న వారికి ప్రాధాన్యత ఇస్తామని యాజమాన్యం పేర్కొంది.

**ఎంపిక విధానం ఇలా**

ఈ అర్హతలు కలిగిన మహిళా ఉద్యోగులు వారికి ఇచ్చిన నమూనాతో అప్లికేషన్లను నింపి వాటిని పూర్తి చేసి సంబంధిత గని మేనేజర్, శాఖాధిపతి, జనరల్ మేనేజర్?కు అందించాలని యాజమాన్యం తెలిపింది. వారి దరఖాస్తులు స్వీకరణ పూర్తయిన తర్వాత జనరల్ మేనేజర్ సీపీపీ నేతృత్వంలో ఒక కమిటీని వేస్తారు. వారు ఈ దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి కనీస అర్హత కలిగిన మహిళా అభ్యర్థులను ఎంపక చేస్తారు. వారి జాబితాను విడుదల చేస్తారు.కమిటీ ఎంపిక చేసిన అభ్యర్థులు సిరిసిల్లలో ఉన్న తెలంగాణ ఇన్స్టిట్యూట్ ఆఫ్ డ్రైవింగ్ ఎడ్యుకేషన్ అండ్ స్కిల్స్ సంస్థలో శిక్షణ పొందాల్సి ఉంటుంది. వారు హెవీ గూడ్స్ వెహికల్, హెవీ మోటార్ వెహికల్ విభాగంలో శిక్షణ అందిస్తారు. అభ్యర్థులు శిక్షణ పూర్తి చేసుకున్న అనంతరం వారికి ఎంపిక పరీక్ష నిర్వహిస్తారు. ఈ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన వారిని ఈపీ ఆపరేటర్ ట్రైనీ కేటగిరి-5 డిసిగ్నేషన్?తో సంబంధిత ఏరియాలకు పంపిస్తారు. ఆసక్తి గల మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవలసిందిగా యాజమాన్యం కోరుతోంది.

# రాజీ మార్గమే రాజ మార్గం

**-జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజగోపాల్**

**-న్యాయ సేవా సదన్ లో జాతీయ లోక్ అదాలత్**

**టీమీడియా, సెప్టెంబర్ 13 ,ఖమ్మం:**

రాజీ మార్గమే రాజా మార్గమని, రాజీ పడదగ్గ కేసులలో రాజీ పడి సత్వర న్యాయం పొందాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జి. రాజగోపాల్ అన్నారు. శనివారం జిల్లా కోర్టు లోని న్యాయ సేవా సదన్ లో జాతీయ లోక్ అదాలత్ ను జిల్లా ప్రిన్సిపల్ జడ్జి, న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ, లోక్ అదాలత్ లో రాజీతో ఇరువర్గాలు గెలిచినట్లేనని, లోక్ అదాలత్ తీర్పు, సుప్రీంకోర్ట్ తుది తీర్పుతో సమానమని అన్నారు. లోక్ అదాలత్ లను కక్షిదారులు సద్వినియోగం చేసుకోని త్వరితగతిన కేసులను పరిష్కరించుకోవాలని అన్నారు. రాజీ మార్గంలో కక్షిదారులు లోక్ అదాలత్ లను సద్వినియోగం చేసుకొని తమ కేసులను శాంతియుతంగా పరిష్కరించుకోవాలన్నారు. కేసులను రాజీతో ముగించేందుకు ఇలాంటి లోక్ అదాలత్ లు ఉపయోగ పడతాయన్నారు. ఎలాంటి ఫీజు లేకుండా న్యాయ సేవా సంస్థ సహకారంతో కేసులను పూర్తి చేసుకోవచ్చని ఆయన తెలిపారు.

కేసులు రాజీ చేసుకోవడం ద్వారా అప్పీలు చేసుకోవడం ఉండదని, కోర్టు చుట్టూ తిరిగితే సమయం, డబ్బు వృధా అవుతుందని, కేసుల పరిష్కారంతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని, లోక్ అదాలత్ ద్వారా కేసులను త్వరితగతిన పరిష్కరించుకోవాలని ప్రధాన న్యాయమూర్తి అన్నారు. కేసుల సత్వర పరిష్కారంతో ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మిద్దామని అన్నారు. కుటుంబ వివాదాల కేసులలో ముఖ్యమైనవి భార్యాభర్తల కేసుల వివాదాలలో ఇద్దరు కలిసి ఉంటే, వారి సంతానంతో పాటు ఇరువర్గాల కుటుంబాలు కూడా సుఖ సంతోషాలతో ఉండి, ఆరోగ్యమైన సమాజం ఏర్పడుతుందని తెలిపారు. జిల్లాలో 4746 కేసులను గుర్తించి, ఇప్పటికే 502 కేసులు పరిష్కరించగా, గత లోక్ అదాలత్ లో 19849 కేసులను పరిష్కరించినట్లు ప్రధాన నాయమూర్తి తెలిపారు. ప్రస్తుత లోక్ అదాలత్ లో 597 కేసుల పరిష్కారం అవనున్నట్లు అన్నారు. భాగస్వాములందరూ లక్ష్య సాధనకు శక్తివంచన లేకుండా కృషి చేయాలన్నారు. క్రిమినల్ కాంపౌండబుల్ కేసులు, సివిల్ తగాదా కేసులు, ఆస్తి విభజన కేసులు, వైవాహిక జీవితానికి సంబంధించిన కేసులు, బ్యాంక్ రికవరీ, విద్యుత్ చౌర్యం, చెక్ బౌన్స్ కేసులు, రోడ్డు ప్రమాదం, డ్రంక్ అండ్




డ్రైవ్, పెట్టి కేసులు, ఇతర రాజీపడ్డ దగిన కేసుల్లో కక్షిదారులు రాజీ పడాలని ప్రధాన న్యాయమూర్తి తెలిపారు.లోక్ అదాలత్ ద్వారా రాజీ మార్గంలో కేసుల పరిష్కారంతో కక్షిదారుల మధ్య సుహృద్భావ వాతావరణం తో పాటు, గ్రామాల్లో ప్రశాంతత నెలకొంటుందని ప్రధాన న్యాయమూర్తి తెలిపారు. లోక్ అదాలత్ లో ఒకరు గెలవడం, ఒకరు ఓడడం ఉండదని, ఇద్దరు విజేతలేనని ప్రధాన న్యాయమూర్తి అన్నారుకార్యక్రమంలో జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు తొండపు వెంకటేశ్వర రావు మాట్లాడుతూ, భవిష్యత్తులో న్యాయ సేవాధికార సంస్థ సేవలు జిల్లా వ్యాప్తంగా ప్రజల్లో తీసుకెళ్లడానికి బార్ అసోసియేషన్ పూర్తి సహకారం



## ఆదివాసీలకు దోమతెరలు పంపిణీ

**టి మీడియా, సెప్టెంబర్ 13,పినపాక ప్రతినిధి:**అశ్వాపురం మండల పరిధిలోని మల్లెలమడుగు గ్రామపంచాయతీలో వలస ఆదివాసీలు నివాసం ఉండే చింతకుంట గ్రామస్తులకు శనివారం స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో అశ్వాపురం సిఐ అశోక్ రెడ్డి దోమతెరలను పంపిణీ చేశారు. చింతకుంట లో కరెంటు లేనందున, ప్రస్తుత సీజన్ లో దోమలు అధికంగా ఉన్నందున, వారికి సహాయ పడాలనే ఉద్దేశ్యం తో దోమతెరలు పంపిణీ చేసినట్లు సిఐ తెలిపారు.ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, పోలీస్ సిబ్బంది, చింతకుంట గ్రామస్తులు పాల్గొన్నారు.



## రాపర్తి శరత్ పుట్టినరోజు వేడుకలు

**టీ మీడియా,సెప్టెంబర్ 13, ఖమ్మం**

:ఖమ్మం నగరం 50 డివిజన్ కార్పొరేటర్ మరియు కాంగ్రెస్ ఒబిసి సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాపర్తి శరత్ కుమార్ జన్మదిన వేడుకలు రాపర్తి నగర్ నందు వారి నివాసంలో ఘనంగా జరిగాయి..భారీ కేకు కటింగ్ అందరి అభిమానుల మధ్య హర్షధ్వనాల మధ్య జరిగింది. మున్నూరు కాపు పెద్దలు, కాంగ్రెస్ నాయకులు, ఇతర పార్టీల వారు మరియు స్థానిక యూత్ తదితరులు పాల్గొన్నారు.. పెద్ద ఎత్తున జరిగిన రాపర్తి శరత్ జన్మదిన వేడుకలకు జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకులు పొదిల రవికుమార్,శెట్టి రంగారావు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గ్రంథాలయ చైర్మన్ పసుపులేటి వీరబాబు, పిసిసి ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావు, ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ యరగర్ల హనుమంతురావు, మున్నూరు కాపు ట్రస్ట్ బోర్డు కార్యదర్శి కనిశెట్టి నర్సయ్య,ఆర్ జె సి కృష్ణ,కార్పొరేటర్ చామకూరి వెంకటనారాయణ, పసుపులేటి నాసరయ్య, పసుపులేటి దేవేందర్, మడూరి పూర్ణచంద్రరావు, యాసా రామారావు,చౌడం నరసింహారావు, జివిఎల్ నరసింహారావు,మూలగొండ్ల శ్రీధర్, సముద్రాల శ్రీనివాసరావు, సంపటి నరసింహారావు, సి హెచ్ విప్లవ్, ఆర్ కె, కె నారాయణ, తిరుమల శెట్టి జయప్రకాశ్, తాళ్ళూరి సోమయ్య, నాంపల్లి శంకరయ్య, ఆకుతోట ఉపేందర్, మందడపు శ్రీను, రమేష్, గోకుల్, కట్ల నాగరాజు, రాపర్తి రవి, శ్రీశైలం,ఎర్రా అప్పారావు, మాటేటి రవి, సమీరా, భీమయ్య, గంగిశెట్టి సురేష్, వెంకట నాయుడు, మల్లు వీరేందర్, కాసిన్ని శ్రీనివాస్, గంటా భాష్కర్ మరియు స్థానిక యూత్ మరియు నాయకులు పాల్గొన్నారు.. ఈ సందర్భంగా పెద్దలు పొదిల రవికుమార్ మరియు శెట్టి రంగారావు మాట్లాడుతూ ఉన్నత చదువులు చదువుకొని యంగ్ అండ్ డైనమిక్ లీడర్ గా ఎదిగి అందరి మన్ననలు పొందిన శరత్ రానున్న కాలంలో మరింత ఉన్నత పదవులు రావాలని కోరుత్షు జన్మదిన శుభాకాంక్షలు తెలిచేసారు.

## వసతి గృహాల తల్లిదండ్రుల సమావేశం

**-పాల్గొన్నజిల్లా సాంఘిక సంక్షేమ శాఖఅధికారి**

**టీ మీడియా, సెప్టెంబర్ 13, మహబూబాబాద్ :**సాంఘిక సంక్షేమ అభివృద్ధి శాఖ మహబూబాబాద్ జిల్లా పరిధిలో గల మొత్తం (24) వసతి గృహాలలో పేరెంట్స్ కమిటీ (తల్లిదండ్రుల సమావేశము) ఏర్పాటు చేయడము జరిగినది. అన్ని వసతి గృహాలలో తల్లిదండ్రులు పిల్లలు అధిక సంఖ్యలో పాల్గొని వారి విలువైన సలహాలు సూచనలు ఇవ్వడం జరిగినది,అట్టి సూచనలు సలహాలు తూచా తప్పకుండా పాటించి భవిష్యత్తులో అన్ని వసతి గృహాలు సజావుగా నడపడానికి ఎంతో తోడ్పడు తున్నవి ఇట్టి వసతి గృహాలలో వసతి గృహ అధికారులు సాంఘిక సంక్షేమ శాఖ సిబ్బంది, హాస్టల్ సిబ్బంది పాల్గొని విజయవంతము చేయనైనది, ఇట్టి పేరెంట్స్ కమిటీ సమావేశాలు జిల్లా సాంఘిక సంక్షేమ అభివృద్ధి అధికారి ఎం.నరసింహస్వామి,లి ఎస్సీ బాయ్స్ హాస్టల్ బలపాల, బాలికల హాస్టల్ కురవి , మరిపెడ , లలో స్వయంగా పాల్గొని విజయవంతము చేశారు.



# పత్తి రైతులను ఆదుకోవాలి

**-భాగం హేమంతరావు**



**?టీమీడియా, సెప్టెంబర్ 13 ,బోనకల్లు :** అకాల వర్షాల వల్ల నష్టపోయిన పత్తి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భాగం హేమంతరావు డిమాండ్ చేశారు. ?శనివారం మండలంలోని గోవిందాపురం(ఎల్) గ్రామంలో దెబ్బతిన్న పత్తి పంటలను సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డితో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా హేమంతరావు మాట్లాడుతూ.. ఈ సంవత్సరం అధిక వర్షాల కారణంగా తెలంగాణలో అనేక ప్రాంతాల్లో, ముఖ్యంగా ఖమ్మం జిల్లాలో పత్తి పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పెట్టుబడులు పెట్టి పంట చేతికొచ్చే సమయానికి అధిక వర్షాల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయినట్లు తెలిపారు. సాధారణంగా ఎకరాకు 15 క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉండగా, ఇప్పుడు కేవలం ఒకటి లేదా రెండు క్వింటాళ్లకు మించి వచ్చే పరిస్థితి లేదన్నారు. వర్షాల వల్ల పత్తి చెట్లు ఏపుగా పెరిగినా, కాయలు కుళ్లిపోవడంతో రైతులు అయోమయ స్థితిలో ఉన్నట్లు తెలిపారు.కౌలు రైతులే వ్యవసాయం చేస్తున్నారని, వారు ముందుగానే కౌలు చెల్లించి, అప్పులు చేసి పెట్టుబడులు పెట్టారన్నారు. అకాల వర్షాలతో కౌలు రైతులు అత్యధికంగా నష్టపోయారు, చాలా మంది ఆత్మహత్య చేసుకునే పరిస్థితికి చేరుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ?కేంద్ర ప్రభుత్వం దిగుమతి సుంకాన్ని ఎత్తివేయడం కూడా రైతులకు నష్టాన్ని కలిగిస్తోందని, తెలంగాణలో 18 లక్షల హెక్టార్లలో పత్తి సాగు చేసినట్లు వెల్లడించారు. మొత్తం రైతులు అప్పులపాలై తీవ్ర నష్టాల్లో ఉన్నారని, ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని నష్టపోయిన రైతులకు, కౌలు రైతులకు నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ?ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి జక్కుల రామారావు, సీపీఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు, రైతులు పుచ్చకాయల తిరుపయ్య, గోళ్ల కన్నయ్య, చింతలచెర్వు మాదారయ్య, కౌలు రైతులు పాల్గొన్నారు.



## సోమవారం నుంచి ఉన్నత విద్యాసంస్థల నిరసన

**టీమీడియా, సెప్టెంబర్ 13 ,ఖమ్మం బ్యూరో :**డిగ్రీ, పిజి, ఫార్మసి, బి.ఈడి, యం.బి.ఎ., యం.సి.ఎ., ఇంజనీరింగ్ విద్యాసంస్థల రాష్ట్ర ఐక్య కార్యచరణ కమిటీ పిలుపు మేరకు స్థానిక యస్.బి.ఐ.టి. అటానమస్ కళాశాలలో జిల్లా ఇంజనీరింగ్ విద్యా సంస్థల యాజమాన్యాల అధ్యక్షుడు చలసాని సాంభశివరావు అధ్యక్షతన ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన విద్యాసంస్థల యాజమాన్యాలు విద్యార్థి సంఘాల ప్రతినిధులతో శనివారం సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఫీజు రీయింబుర్స్ మెంట్ సమస్య అనేది విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు సంబంధించినదని యాజమాన్యాలకు సంబంధించినది కాదని, ప్రభుత్వ నిర్ణయాల వల్ల కళాశాలను నడపటం కష్టతరంగా మారిందని తెలిపారు. అట్టడుగు బలహీన వర్గాలతో పాటు ఆర్థికంగా వెనుకబడిన ఒపెన్ కేటగిరీ విద్యార్థులకు కూడ ఉపయోగపడి వారి జీవితాలను ఉన్నత స్థాయికి తీసుకొనివెళ్ళడంలో కీలకంగా ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్ స్కీమ్ గత 3 సంవత్సరాలుగా ప్రభుత్వ నిర్లక్ష వైఖరి తో కళాశాల యాజమాన్యాలు ఆర్థికంగా చితికిపోయి నాణ్యమైన విద్యను అందించటం క్లిష్టతరంగా మారిందని తెలిపారు.ఈ సందర్భంగా చేపట్టే నిరసన కార్యక్రమాలలో భాగంగా సోమవారం రోజు మధ్యాహ్నం ఖమ్మం లోని అన్ని విద్యాసంస్థల విద్యార్థులను విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ సెంటర్లో గల అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని అదే విధంగా మంగళవారం ధర్నాచౌక్ నందు యాజమాన్య సంఘాలు మరియు అధ్యాపకులు నిరాహార దీక్షను చేపట్టి తదుపరి కార్యక్రమాన్ని ఆ రోజు ప్రకటిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యస్.బి.ఐ.టి. కృష్ణ, విజయ కాలేజి ఉషాకిరణ్, శ్రీ చైతన్య శ్రీధర్, ప్రియదర్శిని నవీన్, మ్యాక్స్ కాలేజి సత్యనారాయణ, డిగ్రీ కళాశాలల భాద్యులు ప్రభాకర్ రెడ్డి , ఇతర విద్యాసంస్థల యాజమాన్యాలు పాల్గొన్నారు.

## సింగరేణిలో అక్రమ మట్టి రవాణా దందా

**అధికారుల నిర్లక్ష్యం ప్రజలకు ప్రాణా సంకటం**

**ట్రాక్టర్ డ్రైవర్లుగా మైనర్లు**



**టీ మీడియా,సెప్టెంబర్ 13,సింగరేణి(కారేపల్లి):** మండల క్రేందమైన సింగరేణి లో అక్రమ మట్టి దందా శృతిమించి పోతుంది. ఎలాంటి అనుమతులు లేకుండా మట్టి ట్రాక్టర్లు విచ్చలవిడిగా రోడ్లపై దూసుకెళ్తున్నాయి. డ్రైవర్లలో చాలామంది మైనర్లు కావడం, అతివేగంతో నడపడం వల్ల ప్రజల ప్రాణాలు క్షణక్షణం ప్రమాదంలో ఉన్నాయి. ఇప్పటికే గతంలో భాగ్యనగర్ తండా గ్రామంలో అక్రమ రవాణా కారణంగా నూతన వధూవరులు రోడ్డు ప్రమాదంలో గాయపడిన సంఘటన మరవక ముందే, మళ్లీ అదే పరిస్థితులు పునరావతం అవుతున్న మండల అధికారులు మాత్రం పట్టించుకునే పరిస్థితి లేదు. మండలంలో ఇలాంటి అక్రమాలకు అడ్డుకట్ట వేయాల్సిన ముఖ్య భాద్యత ఎమ్మార్వో దే. కానీ, తన పరిధిలో విస్తృతంగా జరుగుతున్న మట్టి అక్రమ రవాణాపై మెతక వైఖరి అవలంబిస్తున్నారని మండల ప్రజలు తీవ్ర విమర్శలు చేస్తున్నారు. ఎమ్మార్వో ఆక్రమ మట్టి రవాణా గురించి ఫోన్ చేస్తే దానికి సంబంధించి “మా శాఖకు సంబంధం లేదు” మండల ప్రజా పరిషత్ అధికారి( ఎంపీడీవో )కు ఫోన్ చేయండి అంటూ బాధ్యత లేకుండా తప్పించుకోవడం, అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**ప్రభుత్వ ఆదాయానికి గండి**

ప్రభుత్వానికి కోట్లాది ఆదాయం గండిపడటమే కాకుండా, ప్రజల ప్రాణాలకు ముప్పు ఏర్పడుతున్నా ఎమ్మార్వో సహా సంబంధిత అధికారులు కఠిన చర్యలు తీసుకోవడం లేదు. వెంటనే చర్యలు తీసుకొని అక్రమార్కులపై ఉక్కుపాదం మోపకపోతే, ప్రజా ఉద్యమం తప్పదని గ్రామస్థులు హెచ్చరిస్తున్నారు.

# మండల ప్రభుత్వ కార్యాయాలు ముట్టడి

**టీ మీడియా,సెప్టెంబర్ 13, ముదిగొండ :**

మండల కేంద్రంలో పద్మశ్రీ అవార్డు గ్రహీత వికలాంగుల జీవితాల్లో వెలుగు నింపిన మహనీయుడు దళిత దీనభందువు అభినవ అంబేద్కర్ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు మండల కార్యాలయాల ముట్టడి కార్యక్రమాన్ని నిర్దేశించి ముదిగొండ మండలంలో ముఖ్య కార్యకర్తలు సమావేశం ప్రెస్ మీట్ పెట్టడం జరిగింది ఈ యొక్క కార్యక్రమంలో ముందుగా ముఖ్య అతిథులుగా వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా ఉపాధ్యక్షులు ఇనప ఉపేందర్ పాల్గొనడం జరిగింది అలాగే ఈ యొక్క కార్యక్రమంలో వృద్ధులు వికలాంగులు మరి ముఖ్యంగా యమార్పీస్, యంయస్పి నాయకులు పాల్గొన్నారు ముదిగొండ మండల పోరాట సమితి అధ్యక్షులు గుంజులూరి రాంబాబు అధ్యక్షులు ,ఉపాధ్యక్షులు యస్కె సైదా పాషా, ముదిగొండ విహెచ్పిటస్ గ్రామ అధ్యక్షులు కట్టకూరి రాంప్రసాద్,వేర్పుల వెంకయ్య ,పందుల రాములు,వెంకటరమణ,విక్టోరియా,ఆశా ఈదయ్య వికలాంగులు పాల్గొన్నారు వితంతువులు గురమ్మ గారు మణెమ్మ వెంకటమ్మ గార్లు పాల్గొన్నారు. మరి ముఖ్యంగా ఎమ్మార్పీఎస్ నాయకులు పడిశాల నాగేశ్వరావు , యంయస్పి మండల అధ్యక్షులు. ఎల్ భద్రం ముదిగొండ మండలం ఇంచార్జ్. గూడూరి వీరస్వామి సీనియర్ నాయకులు. మండల అధికార ప్రతినిధి. గోపాల్ రావు వల్లబి గ్రామ అధ్యక్షులు , పాల్గొన్నారు నాగేశ్వరావు గారు మాట్లాడుతూ మండలంలో ఉన్న ప్రతి ఒక్కరు బంధువులు త్వరగా ముదిగొండ మండలం చేరుకొని మా యొక్క కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రసంగించారు. అలాగే భద్రం గారు మాట్లాడుతూ ప్రతి గ్రామం నుండి వందలాదిగా తరలిరావాలని పిలుపునిచ్చారు. అలాగే ఇనుప ఉపేందర్ మాట్లాడుతూ మండలంలో ఉన్న అటువంటి వికలాంగులందరూ 200 మంది తరలివచ్చి మండల కార్యాలయాల ముట్టడిని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు మరియు ఉన్న మండల



వికలాంగుల హక్కుల పోరాట సమితి అధ్యక్షులు మాట్లాడుతూ ఈ యొక్క కార్యక్రమం అన్ని మండలాల కంటే దీటుగా ఉండాలని మన మండలం ముందంజలో ఉండాలని ప్రతి ఒక్కరూ వికలాంగులు వితంతువులు ఒంటరి మహిళలు పెన్షన్ పొందుతున్న ప్రతి ఒక్కరు 9గంటలకల్లా చేరుకొని కార్యాలయం ముట్టడి విజయవంతం చేయాలని మనసూర్తిగా కోరుకుంటున్నానని పిలుపును ఇచ్చారు.



## జాతీయ లోక్ అదాలత్ కు అనూహ్య స్పందన

**టీమీడియా, సెప్టెంబర్ 13 ,కొత్తగూడెం:**
జిల్లా కోర్టులో శనివారం జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించారు. ఈ లోక్ అదాలత్‌కు కక్షిదారుల నుండి అనూహ్య స్పందన లభించింది. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా అన్ని కోర్టుల్లో 11 బెంచీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈసారి జాతీయ లోక్ అదాలత్‌కు అనూహ్య స్పందన లభించిందని చెప్పారు. రాజీమార్గంలో కేసుల పరిష్కారంకోసం కక్షిదారులు పెద్దఎత్తున ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఇందుకు న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, పోలీసు యంత్రాంగం చేసిన కృషిని కొనియాడారు.వైవాహిక వివాదాన్ని సామరస్యంతో పరిష్కరించుకొని ఒక్కటైన దంపతులకు అవార్డు అందజేసి అభినందించారు. రాజీమార్గమే రాజమార్గమని, చిన్న తగాదాలను లోక్ అదాలత్‌లో పరిష్కరించుకుని స్నేహపూర్వక వాతావరణంలో ఉండాలని కక్షిదారులకు సూచించారు. కేసులను పరిష్కరించుకునేందుకు లోక్ అదాలత్ మంచి అవకాశం కల్పిస్తోందని తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం. రాజేందర్ మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో కేసు పరిష్కారమై అవార్డు పాస్ చేస్తే అది అంతిమ తీర్పు అవుతుందన్నారు. కక్షిదారులకు పులిహోర, మంచినీటి సదుపాయాన్ని ఎస్బిఐ వారి సౌజన్యంతో కల్పించారు.ఈ కార్యక్రమంలో మెజిస్ట్రేట్లు కె. సాయి శ్రీ, బి. రవికుమార్, వి.వినయ్ కుమార్, స్పెషల్ జ్యుడిషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ మెండు రాజమల్లు , పి. పివిడి లక్ష్మి, బార్ ఆసోసియేషన్ ఉపాధ్యక్షుడు జే .గోపికృష్ణ, ప్రధాన కార్యదర్శి బాగం మాధవరావు, చీఫ్ డిఫెన్స్ లిగలు ఎయిడ్ కౌన్సిల్ వి. పురుషోత్తం రావు, డిప్యూటీ లీగల్ఎయిడ్ కౌన్సిల్ పి.నిరంజన్ రావు, సీనియర్-జూనియర్ న్యాయవాదులు, బ్యాంక్ అధికారులు, పోలీసు అధికారులు, జిల్లా కోర్టు చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కిరణ్ కుమార్, కోర్టు సిబ్బంది, కక్షిదారులు పాల్గొన్నారు.

## లోక్ అదాలత్ లో 556 కేసులు పరిష్కారం

**టి మీడియా, సెప్టెంబర్ 13, పినపాక ప్రతినిధి:**
జాతీయ మెగా లోక్ అదాలత్ సందర్భంగా శనివారం మణుగూరు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో 556 కేసులు పరిష్కారమయ్యాయి. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మేజిస్ట్రేట్ కంభపు సూరి రెడ్డి మాట్లాడుతూ, రాజీ మార్గం-రాజ మార్గమని, రాజీ పడదగిన కేసుల్లో రాజీ చేసుకొని వారి యొక్క సమయాన్ని కుటుంబ అభివృద్ధికై సద్వినియోగం చేసుకోవాలని కోరారు. చెక్కు కేసుల్లో కూడా వాది, ప్రతివాదులు ఇరువురు కలిసి రాజీ చేసుకోవాల్సిందిగా సూచించారు. క్రిమినల్ కేసులు 489, పీ ఎల్ సి కేసులు 67 పరిష్కారం అయినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బద్దం శ్రీనివాస్ రెడ్డి, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ లావణ్య, డీఎస్పీ రవీందర్ రెడ్డి, లీగల్ ఎయిడ్ కౌన్సిల్ అంకం సర్వేశ్వరరావు, లోక్ అదాలత్ మెంబర్ కె వీర మధుసూదన్, లీగల్ ఎయిడ్ మెంబర్ పోశం భాస్కర్, న్యాయవాదులు, మణుగూరు సి ఐ నాగబాబు, ఏడూళ్ళ బయ్యారం సి ఐ వెంకటేశ్వర్లు, బ్యాంకర్లు, పోలీస్ సిబ్బంది, కక్షిదార్లు పాల్గొన్నారు.



## బీఆర్ఎస్ నుండి కాంగ్రెస్ లో చేరిక

**టి మీడియా, సెప్టెంబర్ 13, పినపాక ప్రతినిధి:**
పినపాక మండలంలోనిచేగర్శల గ్రామంలో శనివారం బిఆర్ఎస్ పార్టీకి చెందిన 110 కుటుంబాలు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరాయి.ముందుగా గ్రామంలోని శ్రీకృష్ణ ఆలయంలో పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే పాయం తదుపరి చేరికల సన్నాహక సమావేశంలో పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న సంక్షేమపథకాలకు ఆకర్షితులై,పార్టీ మీద అభిమానంతో చేగర్శల గ్రామంనుండి భారీఎత్తున 110 కుటుంబాలు కాంగ్రెస్ పార్టీలో చేరడం శుభపరిణామం అన్నారు.సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకున్నారని అభినందించారు. యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా ప్రభుత్వం కల్పిస్తున్న ఉపాధి, ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. చేగర్శల గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానన్నారు. వచ్చే పంచాయతీ ఎన్నికలలో పినపాక మండలంలోని 23 గ్రామపంచాయతీలో కాంగ్రెస్ జెండా ఎగరాలన్నారు.పంచాయతీ ఎన్నికల నాటికి మండలమంతా కాంగ్రెస్ వర్ణం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు గొడిశాల రామనాథం, మాజీ వైస్ ఎంపీపీ కంది సుబ్బారెడ్డి, ఉడుముల లక్ష్మారెడ్డి , పేరం వెంకటేశ్వర్లు,గంగిరెడ్డి శ్రీనివాసరెడ్డి, వెంకటరెడ్డి,పాల్గొన్నారు.



# .లింక్డ్ఇన్” పై యస్.బి.ఐ.టి. లో అవగాహనా సదస్సు

**టీమీడియా, సెప్టెంబర్ 13 ,ఖమ్మం బ్యూరో :**
ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం నుంచే విద్యార్థులు వ్యక్తిగత ప్రొఫైల్ ను కలిగి ఉండాలని యస్.బి.ఐ.టి. కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం కళాశాలలో ఐలెర్న్ శిక్షణా సంస్థ వారిచే నిర్వహించిన అవగాహనా సదస్సులో సంస్థ సి.ఒ.ఒ. శ్రీరామ్ విద్యార్థులనుద్దేశించి ప్రసంగిస్తూ ప్రతి విద్యార్థి లింక్డ్ ఇన్ పోర్ట్ ఫోలియో కలిగి ఉండాలని, పొందిన శిక్షణ సర్టిఫికెట్స్, చేసిన ప్రాజెక్ట్స్, సాధించిన ఇంటర్న్షిప్స్ వంటి వివరాలను అంతర్జాలంలో ఉంచాలని తద్వారా ఉద్యోగ సంస్థలకు తమ వివరాలు అందుబాటులో ఉండగలవని సూచించారు.లింక్డ్ఇన్, గిట్, గిట్ హబ్ వంటి సామాజిక మాధ్యమాలు విద్యార్థులు తప్పక కలిగి ఉండాలని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డా? జి. ధాత్రి తెలిపారు. విద్యార్థులకు అకౌంట్ తయారి, ఉద్యోగ, ఇంటర్న్షిప్ అన్వేషణలపై లింక్డ్ ఇన్ ద్వారా విద్యార్థులకు శిక్షణ ఇప్పించినట్లు తెలిపారు. మొదటి సంవత్సర విద్యార్థులందరితో ప్రొఫైల్ ఖాతాలు తెరిపించి వారి వ్యక్తిగత వివరాలను ఎలా నమోదు చేయాలో ఈ శిక్షణా కార్యక్రమం ద్వారా అందించగలిగామని తెలిపారు.ఇంటర్నెట్ ద్వారా ప్రపంచం ఓ కుగ్రామం లా మారిందని, ఎక్కడినుంచైనా ఎవరినైనా సులువుగా తెలుసుకోగలమని కళాశాల ప్రిన్సిపల్ డా? జి. రాజ్ కుమార్ తెలిపారు. ఉద్యోగ సంస్థలు అభ్యర్థులను ఎంపికచేసే విషయంలో అంతర్జాలంలో అందుబాటులో ఉంచిన వివరాలను గమనిస్తారని కనుక విద్యార్థులు తమ సర్టిఫికెట్స్, ఇంటర్న్షిప్, ప్రాజెక్ట్స్ ఎప్పటికపుడు ఇంటర్నెట్లో అందుబాటులో ఉంచాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఐలెర్న్ సంస్థ సి.ఒ.ఒ. శ్రీరామ్, హెచ్. ఆర్. మేనేజర్ జె. రేణురామన్, బి.డి.యమ్. యస్.కె. మన్సూర్, కళాశాల ఇన్నోవేషన్ సెల్ హెడ్ డా? మురళిమోహన్, కోఆర్డినేటర్ పి. అశ్విని, అకడమిక్ డైరెక్టర్స్ గుండాల ప్రవీణ్ కుమార్, గంధం శ్రీనివాసరావు, డా? ఎ.వి.వి. శివ ప్రసాద్, డా? జె. రవీంద్రబాబు, టి.పి.ఒ. యన్. సవిత, కోఆర్డినేటర్ జి. ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.





## తల్లిదండ్రులకు అండగా ఉండాలి

**-జడ్జి దేవరపల్లి కీర్తి చంద్రిక రెడ్డి**

**టీమీడియా, సెప్టెంబర్ 13 ,ఇల్లెందు:** వృద్ధాప్యంలో తల్లిదండ్రులకు అండగా ఉండాలని ఇల్లెందు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి దేవరపల్లి కీర్తి చంద్రిక రెడ్డి అన్నారు. శనివారం స్థానిక ఇల్లెందు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణంలో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని ఇల్లెందు మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జడ్జి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇటీవలి కాలంలో కన్న తల్లిదండ్రులను పిల్లలు భారంగా భావిస్తున్నారన్నారు. పిల్లలు తల్లిదండ్రుల ఆస్తులు పంచుకుంటున్నారు గానీ, వారి పోషణను, సంరక్షణను పట్టించుకోవడం లేదన్నారు. ఇది చాలా బాధకారమైన విషయం అన్నారు. కావున కొడుకులైనా, కూతుర్లైనా వారిని వృద్ధాప్యంలో ఇబ్బంది పెట్టకుండా సంరక్షించాల్సిన ఆవశ్యకత ఉందని తెలిపారు.లోక్ అదాలత్ ముఖ్య ఉద్దేశం కక్షిదారులు క్షణికావేశంలో పెట్టుకున్న పోలీస్ కేసులు రాజీపడదగిన, మనోవర్తి, గృహింస, చెక్ బౌన్స్, ప్రామిసరీ నోటు కేసులు ఇట్టి కేసుల్లో ఇరువర్గాలు కోర్టుకు వచ్చి రాజీ కుదుర్చుకున్నట్లైతే ఇరు వర్గాలు గెలిచినట్లే అవుతుందన్నారు. తద్వారా ఎంతో విలువైన కాలాన్ని, డబ్బును ఆదా చేసుకోవచ్చు అన్నారు.అనంతరం ఇల్లెందు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జడ్జి చేతుల మీదుగా కక్షిదారులకు పులిహోర పొట్లాలను, మొక్కలు పంపిణీ చేసి విధిగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇల్లెందు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.ఉమామహేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి కీర్తి కార్తీక్, సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ టి.ఇందిర, సీనియర్ న్యాయవాదులు ఎస్.వెంకట నరసయ్య, కొండ నారాయణ, ఎస్.వెంకటేశ్వర్లు, డీఎస్పీ చంద్రబాను, సీఐ.సురేశ్, పోలీసు సిబ్బంది, కోర్టు సిబ్బంది, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పొద్దుటూరి నాగేశ్వరరావు, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు






## ఒకటే వీధి రెండు రాష్ట్రాలు..

### అటు ఆంధ్రా, ఇటు తెలంగాణ

**టీమీడియా, సెప్టెంబర్ 13 , వేంసూరు :**ఒక్క సీసీ రోడ్డు%ొ%రెండు గ్రామాలు. అంతే కాదు రెండు రాష్ట్రాలు. ఆ రెండు రాష్ట్రాలకు మధ్య సరిహద్దు గా మారింది ఆ సీసీ రోడ్డు. అదేంటి అని ఆలోచిస్తున్నారా.. జంట నగరాలు.. పేర్లు వినే ఉంటాం. అలానే రెండు రాష్ట్రాల నడుమ రెండు గ్రామాల మధ్య కొంతైనా సరిహద్దు ఉంటుంది కానీ తెలంగాణ రాష్ట్రంలో ఖమ్మం జిల్లా వేంసూరు మండలం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే ఏలూరు జిల్లా చాట్రాయి మండలం కృష్ణారావుపాలెం కి కేవలం ఒక్క సీసీ రహదారే అడ్డు.తూర్పు వైపు గా నిలబడితే కుడివైపు కృష్ణారావు పాలెం ఉండగా ఎడమవైపు వెంకటపురం గ్రామాలు ఉన్నాయి. సీసీ రోడ్డు మీద నిల్చుని ఒక అడుగు అటు వేస్తే%ొ%ఆంధ్రా రాష్ట్రం. ఒక అడుగు ఇటువైపు వేస్తే తెలంగాణ రాష్ట్రంలో అడుగు పెట్టినట్టే. ఆ గ్రామానికి సరిహద్దు గా ఉన్న సీసీ రోడ్డు రెండు రాష్ట్రాల సరిహద్దు గా మారిందంటే అందరూ ఆశ్చర్యపోతున్నారు.ఒక ఇంటిలో ఉదయం సమయంలో కల్లాపు చల్లితే పక్క రాష్ట్రం లో పడేంత చెరువులో ఉన్నాయి ఇక్కడ ప్రజలందరూ కలిసి కట్టుగానే ఉంటారు. సంబరాలు పండుగలు కలిసిమెలిసి నిర్వహించుకుంటూరు. ఒక్కమాటలో చెప్పాలంటే బయట వ్యక్తులు వస్తే ఇవి రెండు రాష్ట్రాల నడుమ రెండు గ్రామాలుగా చెబితే తప్ప ఎవ్వరికి తెలియదు. రాష్ట్ర విభజన వరకు ఇక్కడ విద్యార్థులు వెంకటాపురం లోని ఉన్నత పాఠశాలలో చదువుకున్నారు. రాష్ట్ర విభజన తర్వాత చనుబండ ఉన్నత పాఠశాలలో స్థానికత కోసం చదువుకుంటున్నారు.



## గోయాజ్ సిల్వర్ జ్యువెలరీ స్టోర్ ప్రారంభం

**టీమీడియా, సెప్టెంబర్ 13 , ఖమ్మం బ్యూరో :**
గోయాజ్ సిల్వర్ జ్యువెలరీ విభాగాన్ని కొత్త రీతిలో నిర్వచిస్తూ దక్షిణ భారతదేశంలో వేగంగా విస్తరిస్తోంది. ఖమ్మం స్టోర్‌ను 13 సెప్టెంబర్ ఉదయం 10:41కి ప్రముఖ నటీమణి మిస్ భాగ్యశ్రీ బోర్స్ గారు ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ... తెలంగాణ, ఖమ్మం లో దాని 14వ స్టోర్‌ను ప్రారంభించామని తెలిపారు. ఈ స్టోర్ లగ్జరీ మరియు సంపదకు ప్రతీకగా ఉంటుందని, ఇక్కడ పొందగల సిల్వర్ జ్యువెలరీ షాపింగ్ అనుభవం విభిన్నమైనదిగా ఉంటుందని తెలిపారు. మొత్తం 1800 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేయబడిన ఈ స్టోర్ అందరి మనసులో నిలిచిపోయే అందమైన అనుభవాన్ని అందిస్తుందని పేర్కొన్నారు. సెప్టెంబర్ 13 నుండి అక్టోబర్ 5 వరకు, అద్భుతమైన ప్రారంభ ఆఫర్లు ఇస్తున్నట్టు చెప్పారు. ?1,00,000 విలువైన సిల్వర్ జ్యువెలరీ కొనుగోలు చేస్తే ?50,000 విలువైన (ఎంపిక చేయబడిన డిజైన్లు) సిల్వర్ జ్యువెలరీ, ?50,000 విలువైన సిల్వర్ జ్యువెలరీ కొనుగోలు చేస్తే ?25,000 విలువైన (ఎంపిక చేయబడిన డిజైన్లు) సిల్వర్ జ్యువెలరీ, ?25,000 విలువైన సిల్వర్ జ్యువెలరీ కొనుగోలు చేస్తే ?12,500 విలువైన (ఎంపిక చేయబడిన డిజైన్లు) సిల్వర్ జ్యువెలరీ ఉచితంగా ఇస్తామన్నారు. గోయాజ్ త్వరలో కొత్త మార్కెట్లలో కూడా ప్రవేశించబోతుందని తెలిపారు. భారతదేశంలోని అతిపెద్ద సిల్వర్ జ్యువెలరీ బ్రాండ్ గోయాజ్ ను ప్రజలు ఆధరించాలని కోరారు.



# మాకు న్యాయం చేయండి

**-డబ్బులు వసూలు చేసి, శవాన్ని చేతిలో పెట్టారు**
**-పోలీసులకు ఫిర్యాదు చేశాం**
**-సాయిరామ్ హాస్పిటల్ పై మీడియా సమావేశం**




**టి మీడియా, సెప్టెంబర్ 13 , ఖమ్మం:** వైద్యం పేరుతో డబ్బులు వసూలు చేసుకుని తమ చేతిలో కొడుకు శవాన్ని చేతిలో పెట్టారని, మా ప్రమేయం లేకుండా అంబులెన్స్‌లో తరలించి ఆ పై మాపై నిందలేస్తున్నారని, దీనిపై సమగ్ర విచారణ జరిపించి తమకు న్యాయం చేయాలని బాధితులు మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం అనేపురం, వెంకట్ తండా గ్రామానికి చెందిన జర్పుల రమేష్ కుటుంబీకులు కోరారు. ఖమ్మంలోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం జరిగిన మీడియా సమావేశంలో రమేష్ మాట్లాడుతూ తన కొడుకు అరవింద్‌కు జ్వరం వస్తుండడంతో ఖమ్మం సాయిరామ్ సూపర్ స్పెషలిటీ లో చేర్పించామన్నారు. ఆరు రోజుల ట్రీట్మెంట్ అనంతరం వెంటిలేటర్ పై బాబు ఉన్నారని చెప్పేసి మాకు తెలియకుండానే వారి హాస్పిటల్ అంబులెన్స్‌లో నన్ను బెదిరించి అదే హాస్పిటల్ లోకి పంపించారని, ఎక్కడకని అడిగినా ఏమీ చెప్పకుండా తమ గ్రామానికి వెళ్లే రోడ్డుకి తీసుకెళ్లారని, మార్గం మధ్యలో వారికి సంబంధించిన ఇద్దరు డాక్టర్లు వచ్చి బాబుకి ఉన్న వెంటిలేటర్‌ను తీసి మీ బాబు ఎప్పుడో చనిపోయారు, అక్కడే చెప్తే మీరు గొడవ చేస్తారని మమ్మల్ని పంపించారని చెప్పడంతో కన్నీరుమున్నీరయ్యామని తెలిపారు. తమ బాబుకి గతంలో ఉన్న అనారోగ్య సమస్యలను చెప్పామని, ఏం కాదు మా వంతు ప్రయత్నం తాము చేస్తామని హాస్పిటల్లో చేర్చుకున్నారని అన్నారు. సీరియస్ గా ఉందని ఐసీయూలో ఉంచి మమ్మల్నెవ్వరినీ బాబు దగ్గరికి వెళ్లనీయకుండా చేశారని వాపోయారు. ఆరు రోజుల వరకు బాబుకు ట్రీట్‌మెంట్ నడుస్తోందని, లక్ష రుపాయలు కడితే 48 గంటల్లో రికవరీ అవుతారని, ఎలాంటి ఇబ్బంది లేదు అని చెప్పేసి రెండు రోజుల తర్వాత మీ బాబు కోమాల్లోకి వెళ్లారని, అతనికి సిటీ బ్రెయిన్ స్కాన్ తియ్యాలని చెప్పారన్నారు. సిటీ బ్రెయిన్ స్కాన్ చేయించి తర్వాత డయాలసిస్ చేయాలని చెప్పారని, నిమ్స్‌లో లివర్లు పాడయ్యాయని చెబితే డయాలసిస్ చేయాల్సిన అవసరం ఏమి వచ్చిందని ప్రశ్నించినట్లు తెలిపారు. డయాలసిస్ చేసిన తర్వాత బాబు వెంటిలేటర్ మీద ఉన్నాడని మీరు పూర్తి ఫీజు కట్టాలని లక్షల్లో డబ్బులు వసూలు చేసి మాకు తెలియకుండానే వారి అంబులెన్స్ లో మా గ్రామానికి వెళ్లే మార్గంలోకి తీసుకెళ్లారన్నారు. మార్గం మధ్యలో తాము సాయిరామ్ సూపర్ స్పెషలిటీ హాస్పిటల్ సిబ్బంది అని, మీ బాబుకు ఉన్న వెంటిలేటర్ తీసేయమని చెప్పి మమ్మల్ని పంపించారని, మీ బాబు చనిపోయారని చెప్పారన్నారు. మా ప్రమేయం లేకుండా వారి అంబులెన్స్ లోనే బయటికి పంపించాల్సిన అవసరం ఏమి వచ్చిందన్నారు. పేషెంట్ కండిషన్ ఏమైనా ఉంటే అదే నాకు వివరించి ప్రత్యామ్నాయం చూయించాలి కానీ నా ప్రమేయం లేకుండానే వారి ఆంబులెన్స్ లోనే తీసుకెళ్లడంతోనే మాకు అనుమానాలు కలిగాయని అన్నారు. ఈ విషయమై ఖమ్మం టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. తమకు తగిన న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అరవింద్ తల్లి ఆదిలక్ష్మి, చందులాల్ కోటేష్ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ఎన్.రవి, కిషన్ నాయక్, సిరి, రవి, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

# ఆశ్రమ వర్కర్ల వేతనాల జీవో నిలిపివేయాలి

**ఉద్యోగ భద్రత కల్పించాలి - సీఐటీయు**
**ప్రారంభమైన హాస్టల్ వర్కర్ల నిరవధిక సమ్మె**



**టీ మీడియా, సెప్టెంబర్ 13,సింగరేణి(కారేపల్లి):**
గిరిజన ఆశ్రమ పాఠశాల హాస్టల్స్‌లో పని చేస్తున్న డైలీ వేజ్, పార్ట్ టైం వర్కర్లకు వేతనాల చెల్లింపుకు 2021 జూన్ 15వ తేదీన ఆర్థిక శాఖ విడుదల చేసిన జీఓ 64 ను నిలిపివేయాలని సీఐటీయు మండల కన్వీనర్ కే.నరేంద్ర డిమాండ్ చేశారు. హాస్టల్ డైలీ వేజ్ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వర్కర్లు నిరవదిక సమ్మెకు దిగారు. శాంతినగర్,మేకల తండా ఆశ్రమ పాఠశాలలు,కారేపల్లి మండల కేంద్రంలో ప్రభుత్వ కళాశాలల గర్ల్స్ హాస్టల్స్ వద్ద సమ్మె కేంద్రాలను సీఐటీయు నేత కే.నరేంద్ర సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాల్సిన ప్రభుత్వం అందుకు విరుద్ధంగా 2021లో ఇచ్చిన జీఓ నెంబర్ 64ను కాంగ్రెస్ ప్రభుత్వం అమలుకు పూనుకోవటం ద్వారా గిరిజన కార్మికులకు నెలకు రూ.4 వేల నుండి రూ.15 వేల వరకు వేతనాలు తగ్గుతున్నాయన్నారు.హాస్టల్ డైలీ వేజ్ వర్కర్స్ కు రిటైర్మెంట్ బెనిఫిట్స్, ఇన్సూరెన్స్ వంటి కనీస సౌకర్యాలు లేకపోవడం సిగ్గుచేటు అని కే నరేంద్ర విమర్శించారు. జీవో 2012 సవరించి 2014 నాటికి ఐదు సంవత్సరాలు సర్వీస్ ఉన్న ప్రతి ఒక్కరిని పర్మినెంట్ చేయాలన్నారు. రూ.10 లక్షల ఇన్సూరెన్స్ ఇవ్వాలని, రూ.5లక్షల రిటైర్మెంట్ బెనిఫిట్ ఇవ్వాలని, గత సమ్మె కాలపు హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని లేనియెడల ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సమ్మెకు ఐఎఫ్‌టీయు జిల్లా నాయకులు భూక్య శివనాయక్ సంఘీభావం తెలిపారు. ఈ సమ్మెలో యూనియన్ నాయకులు బమ్మల అనంత రాములు, నందియా, మాతృ,సారంగి, పద్మ, సరస్వతి, కళావతి, లక్ష్మి, గురువమ్మ, శ్రీను, రాధమ్మ, బుజ్జయ్య, స్వరూప, నాగయ్య, బాబుసింగ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎంపీ ఆర్ కృష్ణయ్య పుట్టినరోజు వేడుకలు

**- ఖమ్మం జిల్లా జాతీయ బిసిసంక్షేమ సంఘం**



**టీ మీడియా,సెప్టెంబర్ 13, ఖమ్మం :**
ఖమ్మం జిల్లా కార్యాలయంలో పిండిప్రోలు రామమూర్తి అధ్యక్షులు ఖమ్మం ఉమ్మడి జిల్లా ఆధ్వర్యంలో ఆర్ కృష్ణ అన్న 71వ పుట్టినరోజు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీసీ రాష్ట్ర నాయకులు డాక్టర్ గోంగూర వెంకటేశ్వర్లు పాల్గొని కేక్ కట్ చేసి కృష్ణన్న కి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేసి అనంతరం వారు మాట్లాడుతూ బీసీలకు పేద వర్గాల కోసం 45 ఏళ్లుగా అలుపెరగని పోరాటం చేస్తున్న బీసీల ఆరాధ్య దేవుడు ఆర్ కృష్ణ అన్న బీసీలకు చట్ట సభలో 50% రాజకీయ రిజర్వేషన్లు సాధించేవరకు విద్యా ఉద్యోగ ఉపాధి లో మన వాటా మనకు దక్కే విధంగా పార్లమెంట్లో బిల్లు పెట్టి రిజర్వేషన్లు సాధించేవరకు మనందరం కలిసి పోరాడదాం అని చట్టసభల్లో రిజర్వేషన్ ఉన్నప్పుడే బీసీలకు న్యాయం జరుగుతుందని అన్నారు ఈ సందర్భంగా పిండిప్రోలు రామమూర్తి మాట్లాడుతూ ఓబీసీ ఉద్యోగుల ప్రమోషన్ లో రిజర్వేషన్లు కల్పించాలి ఆర్ కృష్ణ అన్న రాజ్యసభలో మాట్లాడి బీసీలకు రిజర్వేషన్లు సాధించేవరకు పోరాడుదాం అని ఖమ్మం జిల్లా నుంచి మరొకసారి ఆర్ కృష్ణ అన్న కి పుట్టినరోజు శుభాకాంక్షలు జిల్లా తరపున తెలియజేస్తున్నాము ఈ కార్యక్రమంలో బీసీ జిల్లా నాయకులు బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి రుద్ర ప్రదీప్ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు అనుముల సోమయ్య రిటైర్డ్ ఉద్యోగ సంఘం ప్రధాన కార్యదర్శి చెన్నోజు పుల్లయ్య యువజన సంఘం జిల్లా అధ్యక్షులు పోతగాని రమణ కుమార్ రాష్ట్ర కార్యదర్శి అనసూరి చంద్రశేఖర్ జిల్లా కార్యదర్శి మొరం పాపారావు యువజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు జక్కుల ప్రకాష్ యాదవ్ రఘునాధపాలెం మండల అధ్యక్షులు ఆకుల సురేష్ యువజన సంఘం టౌన్ అధ్యక్షులు గూడూరు హరీష్ గణేష్ రసూల్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.



## కారేపల్లి క్రాస్ రోడ్‌లో సైడ్ డ్రైనేజీకి ప్రతిపాదనలు

**టీ మీడియా, సెప్టెంబర్ 13, సింగరేణి (కారేపల్లి) :**
కారేపల్లి క్రాస్ రోడ్ (రామలింగాపురం)లో నూతనంగా సైడ్ డ్రైనేజ్ నిర్మాణం చేపట్టేందుకు అధికారులు ఆదివారం ప్రతిపాదనలు రూపొందించారు. గత నెల 28వ తేదీన స్థానికుల అభ్యర్థనతో గ్రామంలో రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తాత మధుసూదన్ లు పర్యటించి డ్రైనేజీ సమస్యను పరిశీలించారు. సైడ్ కాలువల నిర్మాణానికి అయ్యే వ్యయ ప్రతిపాదనలను సంబంధిత అధికారులతో రూపొందించి తనకు పంపించాలని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర మాజీ వైరా ఆత్మ కమిటీ చైర్మన్ ముత్యాల సత్యనారాయణకు సూచించారు. దీంతో పంచాయతీ రాజ్ అసిస్టెంట్ ఇంజనీర్(ఏఈ) రాజశేఖర్, వర్క్ ఇన్స్పెక్టర్ వినయ్ లు కారేపల్లి క్రాస్ రోడ్ ను సందర్శించి సైడ్ కాలువలకు కొలతలు వేశారు. సంబంధిత ప్రతిపాదనను ఎంపీ వద్దిరాజు రవిచంద్రకు అందజేయనున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముత్యాల సత్యనారాయణ, కాంట్రాక్టర్ బానోతు రాందాస్, గ్రామస్తులు సిద్ధంశెట్టి నాగయ్య, షేక్ సైజన్, సురభి సాగర్, షేక్ పెద్ద పాష, కంసాని వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.



## కారేపల్లి కస్తూర్బాలో హిందీ దివాస్

**ఆకట్టుకున్న విద్యార్థినుల కళారూపాలు**

**టీ మీడియా, సెప్టెంబర్ 13,సింగరేణి(కారేపల్లి) :**
కారేపల్లి కసూర్భాగాంధీ విద్యాలయంలో శనివారం హిందీ దివాస్ ను నిర్వహించారు. విద్యార్థులకు హిందీలో ఉపన్యాస, క్విజ్, వ్యాస రచన పోటీలను నిర్వహించి ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు. ఈసందర్భంగా విద్యార్థినులు నృత్యాలు, నాటికలు ప్రదర్శించి ఆకట్టుకున్నారు. విద్యార్థులనుద్దేశించి స్పెషల్ ఆఫీసర్ జీ. ఝాన్సీ సౌజన్య మాట్లాడుతూ జాతీయ భాష హింధీపై పట్టు సాధించాలని విద్యార్థులకు సూచించారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు షాహినిసుల్తానా, చీకటి ఝాన్సీ, ఎం. స్వాతి, జీ. విజయ మమత, తదితరులు పాల్గొన్నారు.

## రాజమార్గమే రాజీమార్గం

అందిస్తుందని అన్నారు. ఈ సందర్భంగా లోక్ అదాలత్ లో మోటార్ వాహన కేసుకు సంబంధించి ఇన్సూరెన్స్ కంపెనీ నుండి ప్రమాద మరణానికి 19.50 లక్షల సెటిల్ మెంట్ కు సంబంధించి, పెద్దబోయిన మాధవి, పెద్దబోయిన లక్ష్మణ్ ల ఫ్యామిలీ కేసుకు సంబంధించి పరిష్కారం చేసి, అవార్డు తోపాటు పూల మొక్కలను జిల్లా ప్రధాన న్యాయమూర్తి బహుకరించారు. కోర్టుకు హాజరైన కక్షిదారుల సౌకర్యార్థం భోజన, మంచినీటి సౌకర్యాన్ని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు దేవినేని రాంప్రసాదరావు, న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి చంద్రశేఖర రావు, ఎం. కల్పన, టి. మురళీమోహన్, కాసరగడ్డ దీప, బెక్కం రజని, ఏపూరి బిందు ప్రియ, వినుకొండ మాధవి, బి. నాగలక్ష్మి, అఖిల, న్యాయ సేవాధికార సంస్థ సభ్యులు, మీడియేటర్స్, న్యాయవాదులు, కక్షిదారులు, తదితరులు పాల్గొన్నారు.

## చిర్రావూరి జీవితం ఆదర్శనీయం

**టీ మీడియా,సెప్టెంబర్ 13, ఖమ్మం**
ఖమ్మం మున్సిపల్ మాజీ చైర్మన్ చిర్రావూరి లక్ష్మినర్సయ్య జీవితం నేటి ప్రజా ప్రతినిధులకు ఆదర్శనీయమని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు తెలిపారు. చిర్రావూరి లక్ష్మినర్సయ్య 17వ వర్ధంతి సందర్భంగా రైల్వే స్టేషన్ వద్ద ఉన్న చిర్రావూరి స్తూపానికి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా నున్నా మాట్లాడుతూ జిల్లాలో ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ నిర్మాణంలో లక్ష్మినర్సయ్య పాత్ర మరువలేనిదని తెలిపారు. ధనిక కుటుంబంలో పుట్టి బడుగు, బలహీన వర్గాల కోసం చివరి శ్వాస వరకు జీవించిన మహనీయుడు చిర్రావూరి లక్ష్మినర్సయ్య అని కొనియడారు. భగత్ సింగ్ ను ఉరి తీసిన సమయంలోనే దేశ స్వాతంత్ర్యం కోసం చిన్న వయసులోనే జైలుకు వెళ్లి శిక్ష అనుభవించారని పేర్కొన్నారు. జైల్‌లో వుండి ఆనాడు ఖమ్మం టౌన్‌లోని వార్డు మెంబర్‌గా నామినేషన్ వేసి ఘన విజయం సాధించిన చరిత్ర ఆయనకు మాత్రమే దక్కిందని కొనియాడారు. అనంతరం ఖమ్మం మున్సిపల్ ఛైర్మెన్‌గా 35 సంవత్సరాలు సుదీర్ఘంగా నీతి, నిజాయితీగా ప్రజా పరిపాలన అందించిన ఘనత సీపీఐ(ఎం) ఛైర్మన్ చిర్రావూరి లక్ష్మినర్సయ్యకే దక్కుతుందని తెలిపారు.